

# ప్రాకృత
# గాథా సప్తశతి


సంకలనం : శాతవాహన చక్రవర్తి హాలుడు

అనువాదం : దీవి సుబ్బారావు

# ప్రాకృత
# గాథా సప్తశతి

సంకలనం

శాతవాహన చక్రవర్తి హాలుడు

అనువాదం

దీవి సుబ్బారావు

The Prakrit
GATHA SAPTASATI

Compiled by
Satavahana King Hala

Telugu Translation by
Deevi Subba Rao

© Deevi Subba Rao

First Published in 2012

Cover: Ajanta Caves Painting

For Copies:
Navodaya Book House
Opp. Arya Samaj Mandir, Kachiguda Cross Roads,
Hyderbad - 500 027.

Visalandhra Publishing House
Abids, Hyderabad - 500 001

Printed at:
Vipla Computer Services
Hyderabad

Price: ₹ 130

# విషయసూచిక


| | | |
|---|---|---|
| ముందుమాట | .. | 5 |
| హాల శాతవాహన గాథా సప్తశతి | | |
| మొదటి శతకం | .. | 9 |
| రెండవ శతకం | .. | 36 |
| మూడవ శతకం | .. | 61 |
| నాల్గవ శతకం | .. | 86 |
| ఐదవ శతకం | .. | 111 |
| ఆరవ శతకం | .. | 136 |
| ఏడవ శతకం | .. | 158 |
| వ్యాఖ్యాతల గ్రంథములలోని గాథలు | .. | 181 |
| తెలుగుదేశపు మూలప్రతిలోని గాథలు | .. | 192 |
| ప్రాచీన ఆలంకారిక గ్రంథములలోని గాథలు | .. | 204 |
| లఘుటీక | .. | 211 |
| గాథాకవుల పేర్లు, వారి గాథల సంఖ్య | .. | 218 |
| గాథాకవయిత్రుల పేర్లు, వారి గాథల సంఖ్య | .. | 224 |

# దీవి సుబ్బారావు రచనలు

**కవితలు** : 1. వైశాఖ సముద్రం 2. హంసలదీవి
3. చిన్నప్పుడన్నీ ఆశ్చర్యమే 4. సూరీడు

**కథలు** : 1. కృపావర్షం 2. అడవి పాడింది

**నాటికలు** : 1. అర్థగౌరవం:
యోగవాసిష్ఠం, భారతం, యామునాచార్యులుచరిత్ర,
కాళిదాసు, భారవి గురించిన కథలు ఆధారంగా రచించినవి.

**బాలసాహిత్యం** : అలీబాబా నలభై దొంగలు

**సంపాదకత్వం, పరిష్కరణ** : తత్వగీతం
పోతులూరి వీరబ్రహ్మం, ముదుమాల సిద్దయ్య,
యాగంటి లక్ష్మప్ప, తదితరుల తత్వగీతాలు.

**అనువాదం :**

**1. మాటన్నది జ్యోతిర్లింగం** : బసవన్న, అక్క మహాదేవి, దేవర దాసిమయ్య, అల్లమ ప్రభు కన్నడ వచనాలకు తెలుగు అనువాదం

**2. నవనవం** : వాల్మీకి, వ్యాసుడు, కాళిదాసు, బుద్ధుడు సంస్కృత శ్లోకాలకు తెలుగు అనువాదం

**3. సూఫీ కవిత్వం** : మౌలానా జలాలుద్దీన్ రూమీ, రబియా, ఫరీవుద్దీన్ అత్తార్, హాఫిజ్ సూఫీ కవిత లకు తెలుగు అనువాదం

**4. పరమగీతం** : బైబిల్ ఓల్డ్‌టెస్ట్‌మెంట్‌లోని 'సాంగ్ ఆఫ్ సోలమన్'కు తెలుగు అనువాదం

**5. ధూళిగా మార్చే ప్రేమ పథం** : మెహెర్‌బాబా గజల్ కవితలకు తెలుగు అనువాదం

**6. ప్రాకృత గాథా సప్తశతి** : శాతవాహన చక్రవర్తి హాలుడు సంకలనానికి తెలుగు అనువాదం.

# ముందుమాట

గాథా సప్తశతి పేరుకు తగ్గట్టు ఏడువందల గాథల సంకలన గ్రంథం. భాష ప్రాకృతం. ఆ భాషలో వున్న పద్ధెనిమిది భేదాల్లో మహారాష్ట్రీ ప్రాకృతం ఒకటి. ఈ గ్రంథం అందులోది. ఛందస్సు గాథా ఛందస్సు. సంస్కృతంలో ఇదే ఆర్యా ఛందస్సు.

ఈ గాథల గొప్పదనం గురించి ఎంతైనా చెప్పవచ్చు. గాథల నిండా పల్లెటూరి వాతావరణం పరుచుకొని వుంటుంది. రెండువేల ఏళ్ళ కిందటి ఆ మనుషుల అనుభవాలు ఇప్పటివారమైన మనకు కొత్తగా అనిపించవు. మన ముఖాలు వాటిల్లో ప్రతిబింబిస్తవి. అందువల్లనే ఆ గాథలు సార్వకాలికమైనవి. ప్రకృతి వర్ణనలు కోకొల్లలు. వాటిని చూస్తే ఆశ్చర్యమనిపిస్తుంది. కొన్ని కొన్ని మన వూహకు అందవు. సూక్తులు గూడా వారి వారి అనుభవాల్లోంచి వచ్చినవే. భాష సహజంగా వుండి, పామరులక్కూడా అర్థమవుతుంది. శృంగార వర్ణనలు వున్నా ఎక్కడా ఏమీ అశ్లీలం కనపడదు. జుగుప్స కలిగించదు. స్త్రీ పురుష సంబంధం నిషిద్ధం కాదు. దాని గురించి ఎటువంటి అరమరికలు లేకుండా హాయిగా మాట్లాడుకున్నారు. అలా వ్యవహరించారు. మానసికంగా కూడా ఆరోగ్యంగా జీవించారు. అంతా ప్రేమమయం. అది కవిత్వరూపంలో గాథల్లో జాలువారుతుంది. ప్రతి గాథా సంభాషణరూపంలో వుంటుంది. కోడలు అత్తతోనో, ప్రేయసి ప్రియుడుతోనో ఎవరో ఒకరు ఇంకొకరితో ఏదో చెబుతున్నట్టుగా వుంటవి అన్నిగాథలూ. వర్ణించిన ప్రకృతి దృశ్యాలన్నీ కళ్ళకు కట్టినట్టు వుంటవి. పల్లెటూరి సాధారణ జనుల జీవితం వర్ణితమైనా, ఆ వర్ణన అన్ని స్థాయిలలోని ప్రజలకు అన్వయించేటట్టు వుంటుంది. ఆరకంగా పట్టణాల్లోని ప్రజలు కూడా గాథల ప్రపంచంలోని పౌరులే.

ఈ గాథలు ముఖ్యంగా ధ్వని ప్రధానమైనవి. దేన్నీ వాచ్యం చేసి చెప్పవు. ఆనందవర్ధనుడు, మమ్మటుడు లాంటి ఆలంకారికులు తమ గ్రంథాల్లో వీటిని ఉదాహరణల కింద వాడుకున్నారు. కాళిదాసులాంటి కవుల్నే ఇవి ప్రభావితం చేసినవంటే వీటి ఉత్కృష్టత ఎంతటిదో అంచనా వేయవచ్చు.

గాథలు రచించిన వారిలో పదిమందిదాకా కవయిత్రులు వున్నారు. వారు తమ భావాల్ని నిర్భయంగా, నిస్సంకోచంగా వెలిబుచ్చినారు.

గాథల్లో గోదావరి, తపతి, నర్మద, యమున నదుల, వింధ్య పర్వతాల ప్రస్తావన వస్తుంది. ఈ గాథలు చదివితే ఆ కాలపు ఆచార వ్యవహారాలు ఎన్నో తెలుసుకొనే వీలుంది. బహిష్ఠురాండ్రు ముఖానికి పసుపు కలిపిన నేయి రాసుకొనేవారు. శీలవంతులైన ఇల్లాండ్రు వుండేవారు. అలా కానివారూ వుండేవారు. బీదరికం వుండేది. వ్యవసాయం ముఖ్యవృత్తి. బందిపోటు దొంగల బెడద వుండేది. వారు స్త్రీలను అపహరించుకొని పోతుండేవారు. బహుభార్యత్వం వున్నది. సతీసహగమనం వున్నది. వలసపోవటాలు వుండేవి.

ప్రాకృత గాథాసప్తశతిని వెబర్ అనే జర్మన్ పండితుడు పరిష్కరించి 1870లో మొదటిసారి ప్రకటించినాడు. ఏడువందల గాథల మూల ప్రతి కాక అదనంగా ఇంకో మూడువందలు కలిపి మొత్తం వెయ్యి చేసినాడు. ఆ మూడువందల్లో తెలుగుదేశపు పరిష్కృత ప్రతిలోనివి కొన్ని, వివిధ వ్యాఖ్యాతల గ్రంథాల్లోనివి కొన్ని, అలంకార గ్రంథాల్లో ఉదాహరణలుగా పేర్కొన్నవి కొన్ని వున్నవి. శ్రీ రాళ్లపల్లి అనంత కృష్ణ శర్మగారు హాలుడు సేకరించిన మూలంలోని ఏడువందల గాథలనుండి అయిదువందల పదమూడింటిని, వెబర్ సేకరించిన అదనపు మూడువందల గాథలనుండి రెండువందల ఇరవై అయిదింటిని అనువాదం చేసినారు. వారి అనువాద గ్రంథాన్ని హైదరాబాదు ఆంధ్ర సారస్వత పరిషత్తు వారు 1931లో మొదటిసారి ప్రకటించినారు. శ్రీ శర్మగారు చేసిన కృషి చాలా గొప్పది. శ్రీ తిరుమల రామచంద్రగారు రచించిన “గాథాసప్తశతిలో తెలుగు పదాలు” అనే గ్రంథం గాథల్ని అర్థం చేసుకోవటానికి ఎంతగానో ఉపయోగపడుతుంది.

శ్రీనాథుడు శాలివాహన గాథాసప్తశతిని తెలుగు చేసినట్లు చెప్పినాడుగాని అది దొరకలేదు. పదిహేనవశతాబ్దం మొదట్లో కొండవీటిని రాజధానిగా చేసుకొని పరిపాలించిన పెదకోమటి వేమభూపాలుడు నూటనాలుగు గాథలకు సంస్కృతంలో భావదీపిక అనే పేరుతో వ్యాఖ్యానం రచించాడు. రాధాగోవింద బసక్ అనే ఆయన మొత్తం ఏడువందల గాథల్ని ఇంగ్లీషులోకి వచనంగా అనువాదం చేశాడు. దీన్ని కలకత్తాలోని ఏషియాటిక్ సొసైటీవారు ప్రాకృతమూలంతో సహా 1971లో మొదటిసారి ప్రకటించారు.

హాలుడు సేకరించిన మూలంలోని మొత్తం ఏడువందల గాథల్ని నేను అనువాదం చేశాను. వెబర్ సేకరించిన అదనపు మూడువందల గాథల్లో నూట ఇరవై ఒక్క గాథల్ని అనువాదం చేశాను. నేను అనువాదం చేసిన మొత్తం గాథలు ఎనిమిది వందల ఇరవై ఒక్కటి. నా అనువాదంలో ప్రతి శతకానికి ముందు ప్రాకృత మూలగాథ, దానికి సంస్కృత ఛాయ, ఉదాహరణ కోసం ఇచ్చాను.

అన్ని ముఖ్యమైన భారతీయ భాషల్లోకి గాథసప్తశతి అనువాదం వెళ్ళింది. ఇంగ్లీషు, జర్మనీలోకే గాక ఫార్సీలోకి కూడా అనువదించబడినట్లు తెలుస్తోంది.

ఇంతటి విశిష్టమైన గాథాసప్తశతిని సంకలన పరిచినవాడు హాలుడు. ఇతడు శాతవాహన చక్రవర్తి. శాతవాహనులు తెలుగువారు. వారి పరిపాలనా కాలం సుమారు రెండువేల ఏళ్ల కిందట. శాతవాహనరాజులు ముప్పది మందిలో హాలుడు పదిహేడవవాడు. క్రీ.శ. మొదటి సగభాగంలో అతడు వున్నాడనీ, అతడు రాజ్యం చేసింది కేవలం ఐదు సంవత్సరాలేననీ తెలుస్తోంది. ఈ శాతవాహనులు మొదట్లో ఇప్పటి కరీంనగర్ జిల్లా కోటిలింగాల వద్ద రాజధానిని ఏర్పరచుకొన్నారనీ, తరువాత మహారాష్ట్రలోని పైఠన్‌కు అటు తరువాత కృష్ణాతీరంలోని ధాన్యకటకానికీ తమ రాజధానిని మార్చుకొన్నారనీ చరిత్రకారులు చెబుతున్నారు.

హాలచక్రవర్తి స్వయంగా కవి. కవులను పోషించాడు. కవివత్సలుడని కీర్తిగాంచాడు. అతడు లెక్కకు మిక్కిలిగా వున్న గాథల్ని సేకరించి, వాటిల్లోంచి ఉత్తమమైనవాటిని ఏడువందలు ఏరి గ్రంథస్థం చేశాడు. సగానికి పైగా గాథల కవులపేర్లు కూడా సేకరించాడు.

ప్రాకృతగాథాసప్తశతి భారతదేశంలో వెలసిన అత్యంత ప్రాచీనమైన లౌకిక సాహిత్యానికి సంబంధించిన సంకలనగ్రంథం.

దీవి సుబ్బారావు

హాల శాతవాహన

# గాథా సప్తశతి

## మొదటి శతకం

1. *ప్రాకృతమూలం:*

**पसुवइणो रोसारुण-पडिमा-संकन्त-गोरि-मुहअन्दं ।**
**गहिअग्घ-पङ्कअं विअ संझा-सलिलञ्जलिं णमह ।।** (हालस्स)

*సంస్కృతఛాయ:*

**पशुपतेः रोषारुण-प्रतिमा-संक्रान्त-गौरी-मुख-चन्द्रम् ।**
**गृहीतार्घ-पङ्कजं इव सन्ध्या-सलिलाञ्जलिं नमत ।।** (हालस्य)

*తెలుగులిపిలో ప్రాకృతమూలం:*

పశువఇణో రోసారుణపడిమాసంకంత గౌరిముహ అందమ్ ।
గహి అంఘ పంకఅంవిఅ సంఝూ సలిలాంజలిం ణమహ ॥

*తెలుగు అనువాదం:*

శివుడు
సంధ్యకు వందనం చేయటం చూసి
కోపంతో
ఎరుపెక్కిన గౌరి ముఖం
శివుడి దోసిలి నీళ్ళలో ప్రతిఫలించి
పూజకోసం వుంచిన ఎర్రతామర పూవులా వుంది
సర్వశుభాలు కలిగేటందుకు
ఆ దోసిలి నీళ్ళకు
దండం పెట్టండి (హాలుడు)

2. *ప్రాకృతమూలం:*

**अमिअं पाईअ-कव्वं पढिउं अ जे ण आणन्ति ।**
**कामस्स तत्त-तन्तिं कुणन्ति ते कहँ ण लज्जन्ति ।।**

*సంస్కృతఛాయ:*

**अमृतं प्रकृत-काव्यं पठितुं श्रोतुं च ये न जानन्ति ।**
**कामस्य तत्त्व-चिन्तां कुर्वन्ति ते कथं न लज्जन्ते ।।**

*తెలుగులిపిలో ప్రాకృతమూలం:*

అమిఅం బాఅఇకంవం పఠిదుం సోఢుంవి జేణ జాణంతి ।
కామస్స తంతతంకంతీ కుణంతికహ దేణ లజ్జంతి ॥

*తెలుగు అనువాదం:*

అమృతం లాంటి ప్రాకృత కవిత
చదవకుండా
వినకుండా
ప్రేమతత్వం గురించి వూసులాడే వాళ్ళకి
సిగ్గెందుకుండదు?

3 లోకంలో
అందమైన గాథలు కోటి వున్నవి
వాటిల్లోంచి
ఏడునూర్లు ఏరి
ఒకచోట కూర్చినాడు
కవివత్సలుడు
హాలుడు (హాలుడు)

4 తామరాకు మీద
కదలకుండా కూర్చున్న కొంగను చూడు
పచ్చలరాయి మీద
కుదురుగా వుంచిన శంఖంలా వుంది (వోదిసుడు)

5 నీలి కలువ పూరేకుల్లా వున్న కనురెప్పలు
మూతబడనంత వరకే
రతి సమయంలో స్త్రీలు చేసే చేష్టలు
అందంగా వుంటవి (చుల్లోహుడు)

6 చెలి కౌగిలింత నీ కొరకు గాక
గోరింట చెట్టుకు కావాలనుకొనే నిన్ను చూసి
నీ భార్య అందమైన ముఖం పక్కకు తిప్పుకొని
నవ్వుకొంటోంది (చుల్లోహుడు)

7 ప్రియుల నుండి ఎడబాసిన
ధీరవనితలు కూడా
అశోకవృక్షాల వల్ల మనఃక్లేశం అనుభవిస్తారు
బదులుకు బదులు తీర్చుకొనే
సామర్థ్యం వున్నవారు
తన్నులుతిని వూరికే వుంటారా? (పవారాయసుడు)

8 చూడు అత్తా!
మన వూరికే అలంకారంగా వున్న
కలువల చెరువు
చలికాలం వచ్చేసరికి కళ మారిపోయి
కోసిన నువ్వు చేనులా అయింది (కుమారిలుడు)

9 కోతకొచ్చిన
తెల్లటి వరి పొలాలు చూసి
ఎందుకు దుఃఖిస్తావు?
ముఖానికి పసుపురంగు పూసుకున్న
నాట్యకత్తెలా
పక్కనే జనపచేను పైకి వస్తోంది గదా ! (మహిందుడు)

10 చెలీ!
ముఖం పక్కకు తిప్పుకొని ఏడవకు
ప్రేమగతి ఎప్పుడూ
దోసమొక్క నులి తీగెకు మల్లే
సవ్యంగా వుండదు (అలయుడు)

11 కాళ్ళమీద పడ్డ పతిదేవుడి వీపు ఎక్కి
చిన్నకొడుకు గంతులేస్తుంటే
అంతకోపంలోను ఆమె ముఖం
చిరునవ్వులు చిందించింది. (దుగ్గసామి)

12 ఆమెకు తెలుసు
సరిసమానుల యెడనే ప్రేమకు విలువ అని
ఆమె చనిపోయినా
నిన్నేమీ అనను
ఆమెకు మరణం కూడా
మెచ్చుకోతగిందే (దుగ్గసామి)

13 వంటింటి పనుల్లో
మసి అంటుకున్న చేయి తగిలి
చంద్రబింబంలా మెరిసిపోతున్న
ఇల్లాలి మోము చూసి
మొగుడు ముసిముసి నవ్వులు
నవ్వుతున్నాడు (హాలుడు)

14 వంటవార్పుల విషయంలో
నీవు కడునేర్పరివేగాని, కోపగించుకోకు
సుగంధభరితమైన నీ పూర్పులకు ఆశపడి
పొగవిడుస్తోంది గాని
పొయిలో నిప్పు
రాజుకోవటం లేదు (భీమసామి)

15 తొలిసారి వేవిళ్ళతో వున్న పడుచుపిల్లను
నీ కోరికేమిటో చెప్పమని
చెలులు గుచ్చి గుచ్చి అడిగినపుడు
సిగ్గుతో తలవంచి ఆ చిన్నది
మొగుడికేసి చూసింది (గయసింహుడు)

16 చల్లని చూపులవాడా !
రాత్రి సుందరి ముఖానికి బొట్టువంటి వాడా !
ఆకాశంలో ఉజ్వలంగా వెలిగేవాడా !
ఓ చంద్రుడా !
ఎక్కడో వున్న ప్రియుడి మీద కురిపించే నీ కిరణాల్ని
ఇక్కడ నా మీద కూడా కురిపించు (హాలుడు)

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=1332**

* * *

**Read other books of Deevi Subbarao @**

http://kinige.com/kbrowse.php?via=author&id=314